

# ఊసులాడే ఒక జాబిలటా!

## నిషిగంధ



*యదార్థ సంఘటనలకి నవలా రూపం - ఆసాంతం ఆకట్టుకునే సుమధుర స్నేహ బంధం*

గువ్వల కువకువల సుప్రభాతంతో నిద్ర లేస్తున్న బాలభానుడు. అసుర సంధ్య అల్లరి తట్టులోలేక ఎర్రబడ్డ మొహంతో అస్తమిస్తున్న సూరీడు.. తొలిపొద్దు మలిపొద్దూ గోరువెచ్చగా. నిన్ను గుర్తు చేస్తే అది నా తప్పు కాదు!!

కను రెప్పల కింద భాష్పాలకే కాదు కలలకీ చోటు ఉందనీ.. ఉండాలనీ..

వాడిన పువ్వు మూగవేదనే కాదు స్వచ్ఛమైన పచ్చదనం సాక్షిగా రేపు విచ్చుకోబోతున్న మొగ్గ తెచ్చే ఆశల వర్ణాలనీ గుండె నిండా నింపుకోవాలనీ..

మిత్రమా! నా నిశ్శబ్దపు ప్రపంచంలో, నా వెతల కలతను దూరం చేస్తూ నువ్వు ఆలపించిన ఆత్మీయతా రాగం గాయత్రీమంత్రమై.. నా దోసిలిని నమ్మకాల పూలతో నింపుతూ.

మలయమారుతమై మనసుని కమ్మి..

పదాలే లేని నా బ్రతుకుని శ్లోకంలా మలచుకునేందుకు స్ఫూర్తివైన నువ్వున్న తీరాన్ని నేను చేరగలనా!?

ఒక్కసారి. ఒకే ఒక్కసారి.. నిన్ను చూడాలనీ. నువ్వు నేర్పిన నా బ్రతుకు పాట నీకు వినిపించాలనీ.. అది విని నీ పెదవులపై విరిసిన ఆనందపు నెలవంకలను దొంగిలించి దిగంతాల అంచులకి పరిగెట్టి పారిపోవాలనీ..

నేస్తం! కళ్ళల్లో దీపాలు వెలిగించాను. ఇంక నీ నిరీక్షణలో నాకు చీకటైనా పర్వాలేదు!!

********** ********** **********

నమస్తే ప్రభాత గారు, మాజేరు

మార్చి 5, 1985

అసలే పుస్తక ప్రపంచంతో పరిచయం తక్కువేమో.. అయినా అప్పుడప్పుడూ చదివే ఒకటో అరో పత్రికల్లో కూడా పాఠకుల కోసమేనని కుంటిసాకు చెబుతూ మర్డర్, రాజకీయం, సెక్స్ తో నింపేసిన కథలే వస్తుంటే, అవి చదవలేకా అలా అని ఆ పుస్తకాన్ని విసిరి కొట్టలేకా పజిల్సూ, పదబంధాలూ, సినిమా వార్తలతో చదివేశాననిపిస్తున్న నాకు మీ కవితలు కలిగించిన ఊరట మాటల్లో చెప్పలేనిది..

అవును, నేను మీ అభిమానిని.. ఆరు నెలల క్రితం 'మయూరి' లో మీ రచన చదినప్పటి నించీ మీ కవితా ప్రపంచంలోనే విహరిస్తున్నాను..

లలితమైన పదాలతో మనసుని సూటిగా స్పర్శిస్తున్న మీ శైలి అద్భుతం.. ఇలాంటి పొగడ్తలు ఇప్పటికి మీరు ఎన్నో వినే ఉంటారు.. కానీ మేడం, నా నోటి వెంట ఇదే మొదటిసారి కదా! తల పంకించేసి, చిరునవ్వుతో ఈ అభిమాని వేస్తున్న అభినందన మందారమాలను స్వీకరించండి, ప్లీజ్..

మీ సాహిత్యసేవ నిర్విఘ్నంగా కొనసాగాలని కోరుకుంటూ..

మీ అభిమాని.

*** *** ***

**హలో ప్రభాత గారూ,**

**మాజేరు**

**మే** 20, 1985

గుర్తున్నానా? రెండు నెలల క్రితం మిమ్మల్ని మొదటిసారిగా ఇలానే ఉత్తరంలో పలుకరించాను.. అయినా పేరు కూడా ప్రస్తావించని ఉత్తరాన్ని బట్టి 'నన్ను గుర్తుపెట్టుకున్నారా?' అని అడగటం నా తప్పే.. అందులోనూ మీకొచ్చే ఎన్నో ఉత్తరాలలో నాది గుర్తుపెట్టుకోవటం కష్టమే కదా!!

అప్పుడనుకోలేదు, మళ్ళీ మీకు రాస్తానని.. ఒకసారి అభిమానాన్ని వ్యక్తపరిస్తే సరిపోతుందిలే అనుకున్నా.. ఎంత అజ్ఞానం!! ఇవాళ మీ 'వానచినుకులు' చదివాను.. లేదు మళ్ళీ మళ్ళీ చదువుతూనే ఉన్నాను..

"అనంతం నించీ జారిపడ్డ వాన చినుకు
గాజు కిటికీ అద్దం మీద
అనుపమానమైన దృశ్యం చిత్రించినట్లు..
ఆలంబనలేని నా ఆలోచనలన్నీ
నీ చెలిమి శృతి ఫలకంపై చేరగానే
కలలై, కథలై, కవితలై.. ఎన్నెన్ని రూపాలు!!"

స్నేహం అందించే ఆలంబనని ఎంత హృద్యంగా చెప్పారో మేడం!! చిక్కని వెన్నెల రాత్రి మీ వాన చినుకులలో నిలువెల్లా తడిసిపోతున్నాను.. భావుకత అంటే చంద్రుడినీ, మల్లెల్నే కాదు రాళ్ళనీ, నీళ్ళనీ ఉపయోగించి మనసుని స్పందింపచేయడం.. కదూ! అందుకే మీకు

రాయకుండా, నా ప్రశంశలందించకుండా ఉండలేకపోతున్నాను..

అంతే కాదు నాలో ఇంకో అత్యాశ కూడా మొదలయ్యింది.. 'కుదరదేమో.. బాగోదేమో' అని మనసు నసుగుతుంటే చుట్టూ ఉన్న గాలి అలలు మాత్రం 'ఏం పర్లేదు అడిగెయ్యమని' ముంగురులతో ధైర్యం చెప్పిస్తున్నాయి.. అందుకే అడిగేస్తున్నా, "మీ ఆటోగ్రాఫ్ కావాలి మేడం!"..

అయ్యో అలా విసుగ్గా చూడకండి.. నాకు తెలుసు ఇలా ఉత్తరంలోనే ఆటోగ్రాఫ్ అడగటం భావ్యం కాదని.. కానీ ఏం చెయ్యను మేడం, మిమ్మల్ని ముఖాముఖీగా కలిసే అవకాశం నాకు వస్తుందో రాదో.. అందుకే, ఇందాక నేనన్నట్లు అత్యాశ అన్నా అనుకోండి లేదా ముందు జాగ్రత్త అన్నా అనుకోండి..

మీకు ఇబ్బంది కలగకూడదనే నా అడ్రెస్ రాసిన కవర్ కూడా ఈ ఉత్తరంతో పాటు జత చేస్తున్నా.. ఇలా రిటర్న్ కవర్ పంపానని మీరేమీ హడావిడిగా రాయాల్సిన అవసరం అస్సలు లేదు..

ఎప్పుడైనా మీకు ఊసు పోకో, నిద్ర పట్టకో తలవని తలంపులా నా ఈ అభ్యర్ధన గుర్తొస్తే, అప్పుడు రాయండి.. చాలు!

అయ్యో మర్చేపోయాను.. కార్తీక! అదే మేడం.. నా పేరు కార్తీక!!

ధన్యవాదాలు
కార్తీక

*** *** ***

కార్తీక గారూ,

హైదరాబాదు
మే 25, 1985

This is Prabhata. మీ ఉత్తరాలకీ, నా కవితపై మీ అభిప్రాయానికీ, ముఖ్యంగా మీ అభిమానానికీ కృతజ్ఞతలు.. మీలాంటి అభిమానుల ప్రశంశలే కొత్త ఆలోచనలకూ, కవితలకూ ఊపిరి పోస్తాయి..
పేరు చెప్పకపోయినా మీ రెండవ ఉత్తరం తెరుస్తూనే మిమ్మల్ని గుర్తుపట్టేశాను.. ఎలా అని అడగరేం?

మీ చేతివ్రాత! అంటే ముత్యాల్లా ఉందని కాదు!! అక్షరాలని ఒకదాని పక్కన ఒకటి పడుకోబెట్టినట్లు తమాషాగా రాసారు :-) తెల్ల కాగితం మీద కూడా లైను మీద రాసినట్లు ఎక్కడా వంకర లేకుండా (అదీ పడుకోబెట్టి) రాయడం ఆసక్తికరంగా అనిపించింది.. జస్ట్, అనిపించింది చెప్పాను.. ఏమనుకోకండి మరి..

మీరు ఒట్టి ఆటోగ్రాఫ్ అడిగితే నేనిదంతా ఎందుకు రాస్తున్నానని నాకే సందేహం వస్తుంది ఇప్పుడు.. అసలు సమాధానం ఇప్పుడు తట్టటం లేదు కానీ ఒక విషయం మాత్రం మీకు చెప్పాలి.. అది, మీరనుకున్నంత గొప్పగా ఏమీ రాయను నేను.. చిన్నప్పటి నుంచీ మనసుకు అనిపించింది ఏదో పుస్తకంలో రాసుకోవటం అలవాటు.. ఈ మధ్య నుంచే అది బయట ప్రపంచంతో పంచుకోవటం మొదలు పెట్టాను.. అంటే ఈ కవితా ప్రపంచంలో నేను వేశేవి ఇంకా తప్పటడుగులే! ఇంకా చాలా ఎదగాలి, ఎంతో దూరం నడవాలనుంది.. ఎన్నో కదలికలను, ఆలోచనలను, ఊహలను, అనుభూతులను అందరితో పంచుకోవాలనుంది..

నా ఈ ప్రయత్నానికీ, మీ లాంటి అభిమానుల సాయం నాకు చాలా అవసరం.. ఎందుకంటే నా ఆలోచనా పరిణీతిని బయటనుంచి గమనించగలిగేది కేవలం కవితా విమర్శకులే కాదు మీ వంటి పాఠకులు కూడా! కేవలం మెచ్చుకుంటూనే కాకుండా, నచ్చక పోయినా నిర్ద్వంద్వంగా చెప్తే చాలు..

అంతే కాదు.. మీరనుకున్నట్లు అభిమానుల నుంచి నాకేమీ బస్తాల కొద్దీ ఉత్తరాలు రావండి.. వారానికి ఐదో, ఆరో ఉత్తరాలు.. వస్తాయి.. కానీ అన్నిటికి నా సమాధానం మాత్రం 'ధన్యవాదాలు' 'థాంక్స్' అనే!!

చాలా రోజుల తర్వాత ఇంత పెద్ద రిప్లై రాస్తున్నా.. దానికి ముఖ్య కారణాలు, ఒకటి మీరు ఆల్‌రెడీ మీ అడ్రెస్ ఉన్న కవర్ పంపడం అయితే, ఇంకోటి మీ పేరు!! చాలా రోజుల తర్వాత మంచి తెలుగు పేరు విన్నా.. చక్కగా ఉంది!

ఇక్కడ మీకో ముఖ్య విషయం చెప్పాలి.. 'ప్రభాత' నా కలం పేరు మాత్రమే.. అసలు పేరు వంశీ.. వంశీ మోహన్! అంటే అర్థం అయింది కదూ.. మీరనుకున్నట్లు నేను 'మేడం' కాను :-)

నేను అబ్బాయినన్న విషయం ఎంతమందికి తెలుసో అంతేమందికీ తెలీదు.. సో చాలా మంది మీలానే పొరబడుతుంటారు.. అసలు నేనెవరో తెలిశాక కొందరు నిరుత్సాహ పడుతుంటారు, ఇంకొందరు "అలానా" అని జస్ట్ తలాడించేసి ఊరుకుంటారు.. మరి మీరే కోవలోకి వస్తారో!?

ఉంటాను..

'ప్రభాత' (వంశీ)

**-తరువాయి భాగం వచ్చే సంచికలో-**

ఈ సీరియల్ నవలలో అక్కడక్కడ సందర్భానుసారం తమ కవితల్ని ఉపయోగించుకునేందుకు అనుమతి నిచ్చిన కిరణ్‌ప్రభ గారికి కృతజ్ఞతలు

\- రచయిత్రి